# ఎందుకు?


ప్రచురణలు

అభ్యాస విద్యాలయం

దీపా మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు

విజయవాడ

944057992

ఎందుకు? (ప్రచురణ-1)

జనవరి, 2015

రచన :

వై. మాలతీకృష్ణ

ఎందుకు? చర్చ :

వై.మాలతీకృష్ణ.

వై.వి.కృష్ణ,

పి.సుబ్రహ్మణ్యం

బొమ్మలు :

వై.వి.కృష్ణ

డి.టి.పి. :

యం.వి.వర్మ

అలరు పబ్లికేషన్స్

దీపా మెమోరియల్‌ఛారిటబుల్ ట్రస్టు

విజయవాడ

ప్రతులకు :

అభ్యాస విద్యాలయం

గంగిరెద్దుల దిబ్బ

విజయవాడ

ఫోన్ 9440579922

వెల : రూ.23/-

# ముందుమాట

మనిషి జీవితంలో పాటకి అనితరమైన ప్రాధాన్యం, ప్రయోజనం ఉన్నది. మరి ఆట, పాట – పని, పాట అనే సామెతలు ఊరకనే పుట్టలేదు కదా! జీవితంలో గడించిన అనుభవసారాన్ని మన పెద్దలు యీ సామెతల్లో పొందుపరిచారు. పిల్లల మనోవికాసానికి, శారీరక ఆరోగ్యానికి పరిపూర్ణత్వం కలిగేది ఈ ఆటపాటల వలనే. విద్యార్థికి చదువులో కుతూహలం కలనిదే అతను విద్యార్జనలో సఫలీకృతుడు కాలేడు. ఆ కుతూహలం ఆటపాటల ద్వారా, కథలు, డ్రామాలు, క్రాఫ్టు వంటి అనుబంధ రంగాల మాధ్యమం ద్వారా కలిగించడం సులభతరమవుతుంది. పనిలో అలసట, విసుగు కలగకుండా పాట ఎలాంటి పాత్ర, ప్రయోజనం నిర్వహిస్తుందో, చదువులో యాంత్రికతను పోగొట్టడానికి ఆట, పాటలు అంతగా ఉపకరిస్తాయి. ఈ ఉపకరణాలు భాషావ్యాకరణాలకన్నా విద్యార్థిని ప్రోత్సహించి ప్రభావితం చేస్తాయి. వీటికి తోడు ప్రశ్న విద్యార్థి మానసిక మేధోపరిణామ క్రమానికి పదునుపెడుతుంది. అందుకే ఏ చదువైనా ముందు ప్రశ్నించడం అనేది నేర్పాలి. ప్రశ్నించడం అలవడితే సమాధానాల కోసం వెతుకులాట ప్రారంభమవుతుంది. ఇప్పటి విద్యావిధానంలో లోపిస్తున్నది సరిగ్గా ఇదే.

ఈ పుస్తకంలో పేరుతో మొదలుకొని చివరిగా ముఖ్యమైన మాట వరకు ఆటపాటలు ఎందుకంటే అన్న ప్రశ్నకు విద్యాబోధన పరంగా చక్కని తర్కబద్ధమైన సమాధానాలు పొందటానికి కావలసిన సమాచారం ఇవ్వబడింది. వ్యక్తిలో సృజన, భావప్రకటన పెంపొందించడానికి ఆటపాటలు తప్ప మరోమార్గం వల్ల అంతగా ప్రయోజనం ఉండదన్న నిర్ధారణకు చదువరి రాక తప్పదు. “ఎందుకు” అన్న ఈ పుస్తకం.... అందుకే చదవాలి. రచయిత్రి మాలతీకృష్ణ, బొమ్మలతో అలరించిన జీవితభాగస్వామి కృష్ణ, వారి సహచరులు పి.సుబ్రహ్మణ్యం ఇందులో చర్చించిన విషయాలు అందుకే చాలా అమూల్యమైనవి. తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, సంఘాన్ని మరమ్మత్తు చేద్దామనుకునే సంస్కర్తలు... అందరికీ అవసరమయిన పుస్తకం కూడా. ఎందుకో చదువుతూ ముందుకు వెళ్ళండి..... మీకే అర్థమవుతుంది.

సి. రాఘవాచారి
విశాలాంధ్ర పూర్వ ఎడిటర్

## అంకితం

పిల్లల స్వేచ్ఛాస్వతంత్రాలకు విలువనిచ్చే
టీచర్లకు,తల్లితండ్రులకు..........

# “ఆటలెందుకు?”




ఈ ప్రశ్నకి సమాధానం దొరకని ఓ వ్యక్తి
సీగాన పెసూనాంబతో ఆడుకుంటున్న బుడుగుని పిల్చి అడిగాడు.
ఎగాదిగా సీరియస్‌గా చూశాడు బుడుగు. ఫక్కున నవ్వాడు ఒక్కసారిగా.
“ఇదేం ప్రశ్నా?! ఒఠ్ఠి వెంగళప్పాయ ప్రశ్న!
కళ్ళజోడెందుకు?
పలకెందుకు?
చొక్కాకి బొత్తాలెందుకు లాంటి ప్రశ్నలుంటాయి గానీ –
మెడకాయ మీద తలకాయ వున్న వాడెవడైనా ఇంత వెర్రిబాగుల ప్రశ్న అడుగుతాడా?
ఆటలెందుకు?.... ఆడుకోవడానికి!!!”
అనేసి తుర్రున పారిపోయాడు.
‘అవును కదా!’ అని బుర్రగోక్కున్నాడు సదరు వ్యక్తి.
ఇది వరకిట్లో అమ్మలు పాడే దీవెనలాంటి ఓ పాట ఉండేది.
“‘చదువుకో నాయనా చదువుకో తండ్రీ
చదువుకుంటే నీకు సౌఖ్యమబ్బేను
పాడుకో పాడుకో రత్నాల మొలక
తేనె వానలు మమ్ము ముంచుకొచ్చేని.
ఆడుకో నాయనా ఆడుకో తండ్రీ
ఆడుకుంటే నీకు ఆనందమరయు!”

ఎంత అనురాగపూరితమైన దీవెన!

పిల్లలు ఆడుకోవాలి కాబట్టి ఆటలు!

ఆటలు వాళ్ళ జన్మహక్కు కాబట్టి ఆటలు!

ఆటలు వాళ్ళ ఊపిరికాబట్టి ఆటలు!

ఆటలు వాళ్ళకిష్టం కాబట్టి ఆటలు!

అవును – ఆటలు అచ్చంగా ఆటలకోసమే!

మరే పెద్ద ఉద్దేశ్యాలూ, ప్రయోజనాలూ అక్కర్లేదు.

'ఆటలు ఆటలకోసమేనా?

ఇదో వెంగళప్పాయ సమాధానం కాదూ మరి!?

అదేం కుదరదు. ఏ ప్రయోజనమూ అక్కర్లేదంటే ఎలా?'.... అంటారా?

ఐతే సరే... ఒక్క ప్రయోజనమేం ఖర్మ!

భారీప్యాకేజీనే ఉంది.

ఒక్క దెబ్బకి వంద పిట్టలన్నమాట!

చదవండి మరి...

## ఆటలెందుకు?

### శారీరక అభివృద్ధికి.....



పిల్లలు ఆరోగ్యంగా, దృఢంగా ఎదగడానికి

పరుగులెత్తి, ఆడుకునేటప్పుడు గుండె, ఊపిరితిత్తుల వంటి భాగాలు చాలా చురుకుగా పనిచేస్తాయి. అందువల్ల శరీరంలోని అన్ని భాగాలకు రక్తప్రసరణ బాగా జరుగుతుంది.

ఆరుబైట సూర్యరశ్మిలో ఆడుకోవడం వల్ల ఎముకలు దృఢంగా తయారౌతాయి.

కండరాలకు మంచి వ్యాయామం లభించి, పటుత్వం పెరుగుతుంది. వ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది. ఆటలాడుకునే పిల్లలు అరుదుగా వ్యాధుల బారిన పడతారు.

ఆకలి చక్కగా వేస్తుంది. వ్యర్థమైన చిరుతిళ్ళు తగ్గించి, మంచి ఆహారం తినిపించడానికి ఇది చక్కటి మార్గం.

ఊబకాయం సమస్య ఉండదు. బద్ధకం వదులుతుంది.

గెంతడం, కుందడం, జారడం వంటి ఆటల ద్వారా కదలికలలో బ్యాలెన్స్ వస్తుంది.

బంతి, రింగు లాంటివి విసరడం పట్టుకోవడంలో కంటికి – చేతికి సమన్వయం పెరుగుతుంది.

చురుకుగా ఉంటారు – చిన్నచిన్న పనులకే అలసట రావడం ఉండదు.




## ఆటలెందుకు?

### సాంఘికాభివృద్ధికి....

నలుగురితో మెలిగే తీరు, నైపుణ్యాలు మెరుగుపరచుకోడానికి

ఆటలాడాలంటే ఎలాంటి పిల్లలైనా నలుగురిలో కలవాల్సిందే – ఒక్కరే ఆడుకోలేరు కాబట్టి!

కోపం, ఆవేశం, బాధలాంటి ఉద్వేగాలెన్ని కలిగినా, అవన్నీ కాసేపు ప్రక్కనపెట్టి సర్దుకు పోవాల్సిందే! ఎవరూ నేర్పకుండానే అలవడే నైపుణ్యమిది.



ఆటలన్నాక నియమాలు ఉంటాయి. వాటిని పాటించకపోతే జట్టులో స్థానముండదు కనుక నియమాలకు కట్టుబడి ఉండడం అప్రయత్నంగానే అలవాటవుతుంది.

జట్లుగా ఆడే ఆటలలో తప్పనిసరిగా పరస్పరం సహకరించుకుంటారు. ఒక్కరి వల్ల కాదనీ, ఒకరి ఆట ఇతరుల ఆటపైన కూడా ఆధారపడి ఉంటుందనీ అర్థమవుతుంది.



'అందరూ కలిసి చెయ్యడం' అనే భావన యొక్క విశిష్టత, అవసరం స్పష్టమౌతాయి.

తరగతి గదుల్లో ఉండే వయోవిభజన (ఒకే వయసు వున్నవారు మాత్రమే ఒక బృందంగా ఉండడం) అనేది సాధారణంగా ఆటలలో ఉండదు. వయస్సుల్లో ఉండే కొద్దిపాటి హెచ్చుతగ్గులు నైపుణ్యానికి పెద్ద విషయం కాదని చెప్పకనే తెలుసుకుంటారు.



తమకన్న పెద్ద/చిన్న వారితో కలిసి ఆడడంలో ఎన్నోరకాల సర్దుబాటు నైపుణ్యాలు అలవడతాయి.

ఎదుటి బృందం నైపుణ్యాలను గుర్తించడం, గౌరవించడం, తగిన విధంగా తమను సంసిద్ధులుగా చేసుకోవడం ఆటలలో ఒక భాగం.

అందరితో కలిసి ఉ్యూహరచన చెయ్యడం, ప్రణాళికను వేసుకోవడం దానిని కార్యరూపంలో పెట్టేలా చూడడంలో నాయకత్వ నైపుణ్యాలు అబ్బుతాయి.

నాయకుని ఆధ్వర్యంలో బృందలక్ష్యాలకు అనుగుణంగా పనిచెయ్యడం కూడా!

## ఆటలెందుకు?

### సృజనాత్మక వ్యక్తీకరణకు...

క్రొత్త విషయాలను సరిక్రొత్త పద్ధతిలో ఆలోచించడం పిల్లల సహజగుణం.

స్వేచ్ఛాయుత వాతావరణలో పెరిగే పిల్లలు తాము చేసే పనులలో తమదైన ముద్ర ఉండాలని ప్రయత్నించడం గమనిస్తాం.



ఖోఖో, అష్టచెమ్మ, వాలీబాల్ లాంటి పరిచయమున్న, నియమనిబంధనలు నిర్దేశించబడిన ఆటలు ఆడడానికి ఇష్టపడినట్లే, క్రొత్త ఆటలను కనిపెట్టడానికి అత్యంత ఉత్సుకతను చూపిస్తారు.

పిల్లలు కనిపెట్టిన ఆటలు నియమనిబంధనలు సరళంగా ఉండి – తప్పనిసరిగా 'సరదా'గా ఉంటాయి.

మనకు తెలిసిన ఆటలలో నైపుణ్యాల ఆధారంగా గెలుపు ఓటములు ప్రధాన పాత్రవహిస్తే – పిల్లలు సృష్టించిన ఆటలు అందరూ కలిసి నవ్వుకునేలా ఉండి –



ఎవరు గెలిచారన్నది తక్కువ ప్రాధాన్యత కలిగి ఉంటుంది.

అందుబాటులో ఉన్న వస్తువులతో, ఉన్న సభ్యులతో, స్థలాన్నిబట్టి, సమయాన్ని బట్టి (రాత్రా, పగలా / ఇద్దరా, పదిమందా / అసలే వస్తువులు లేకపోయినా గానీ) అప్పటికప్పుడు

సరిక్రొత్త ఆటను సృష్టించడం (అదీ అందరికీ ఆమోదయోగ్యంగానూ, ఇష్టంగానూ ఉండేలా) ఎంతో సృజనాత్మకత ఉంటేగానీ కుదరని విషయం.

అప్పటికప్పుడు సందర్భానికి తగిన మార్పులు, సడలింపులు చేసుకోవడం ప్రజ్ఞతో కూడిన విషయం. పిల్లలకే బహుశా అది సాధ్యం!

## ఆటలెందుకు?

### భావోద్వేగ వికాసానికి

ఉద్వేగాలను నియంత్రణలో వుంచుకునేందుకు....

జీవితం భావోద్వేగాల పూరితం. వాటిని అదుపులో ఉంచుకోలేక, వాటిలో కొట్టుకుపోవడం వల్ల పెద్దల జీవితాల్లో ఎన్నో సమస్యలు.

నిత్యం యాంత్రికంగా పుస్తకాలతోను, టివిలతోను గడిపే పిల్లలకు రకరకాల భావోద్వేగాల అనుభవం ఉండదు. కాబట్టి సున్నితమనస్కులుగా ఉండడానికి, భావోద్వేగ సమతుల్యం లేకపోవడానికి అవకాశం ఎక్కువ.

ఆటలాడేటప్పుడు ఎన్ని రకాల అనుభవాలు!!! గెలుపు ఓటములలో కలిగే సంతోషం, ఉద్వేగం, ఉత్సాహం, ఆవేశం, కోపం, బాధ, నిరుత్సాహం, ఈర్ష్య.... ప్రతి పిల్లవాడు ఈ



ఉద్వేగాలనన్నీ అనుభవించాల్సిందే! వాటినుంచి సమతుల్యంతో వ్యవహరించడం అలవర్చుకోవలసిందే!

నిర్దిష్ట నియమ నిబంధనలు కలిగిన ఆటలను చిన్నతనంనుండి ఆడుతూ ఉన్న పిల్లలు పెద్దయ్యాక భావోద్వేగ సమతుల్యతను (Emotional Balance) కలిగి ఉంటారనేది ఒక సామాన్య పరిశీలన. ఆటలలో ఓసారి ఓడిన పిల్లవాడు దాన్ని వదిలిపెట్టెయ్యడం చూడం. తన ఓటమికి కారణాలు వెతుక్కుని మరింత కృషితో మెరుగైన నైపుణ్యం ప్రదర్శించడానికే ప్రయత్నిస్తాడు.

ఆటలాడుతూ పెరిగిన పిల్లలు ఓటమికి అతిగా కుంగిపోవడం, ఒక్క గెలుపుతో ఇక చెయ్యాల్సింది లేదన్నట్టు వదిలెయ్యడం చెయ్యరు.



ఓటమికి తావే లేదన్నట్టు చిత్రీకరించబడుతున్న నేటి చదువు, ఉద్యోగాల నేపథ్యంలో ఈ విషయం మరింత ముఖ్యమైనది.

ఆటలలో ప్రతి చిన్న వ్యక్తిగత విజయం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. చదువులలో నెమ్మదిగా ఉండే పిల్లలకు ఇది అత్యంత అవసరం.

తన నైపుణ్యానికి జట్టులో లభించే గుర్తింపు వల్ల ఆత్మగౌరవం పెరుగుతుంది.

## ఆటలెందుకు?

### మేధోవికాసానికి....

“ఆటల వల్ల సమయం వృథా. పసిపిల్లలకు ఆటలుకానీ చదువుకోవాల్సిన వయసులో ఆటలు ధ్యాస వుంటే ఇక చదువు సాగినట్టే”

“అసలే చదువులో నెమ్మది. ఒకటికి నాలుగుసార్లు చదివితేకానీ బుర్రకెక్కదు. వీడికి ఆటలా? ఆదివారం ఆడుకుంటాడ్లే. గంటసేపు ఆడుకునే బదులు ఓ ప్రశ్న నేర్చుకోవచ్చు”

చదువులో అంత చురుకు కాని పిల్లల తల్లితండ్రుల అభిప్రాయాలు సాధారణంగా ఇలా ఉంటాయి.

ఇది వందశాతం తప్పు. పిల్లలు ఎప్పుడో పరిస్థితులు అనుమతించినప్పుడు ఆడుకోవడం కాదు. ప్రతిరోజూ ఆడుకోవాలి – తప్పనిసరిగా!

మరి సమయం వృథా కాదా? ఖచ్చితంగా కాదు. రోజుకోగంట ఆటలకి కేటాయించడం వృథా కాదు. కనీస అవసరం!

శరీరానికి వ్యాయామాన్నిచ్చే ఆటల వల్ల పిల్లలలో వత్తిడి, ఆందోళనలు తగ్గుతాయి.

శారీరకంగా ఆరోగ్యంగా వున్న పిల్లలకే మెదడు చురుకుగా పనిచేస్తుందన్నది అందరికీ తెల్సిందే!

చదువులో వెనుకబడి వున్న కారణంగా ఆటలకు దూరం చేస్తే చిన్నారులు మరింత కృంగిపోతారు. ఆటలలో వారి నైపుణ్యాలు బహిర్గతమయ్యే అవకాశాలుండడం వల్ల, విజయాలు లభించడం వల్ల ఆత్మవిశ్వాసం పెరిగి, అది చదువులో మెరుగుపడే అవకాశాన్నిస్తుంది.

భాష, లెక్కలు వంటి విషయాలలో వెనుకబడిన పిల్లలు ఆటల (బోర్డుగేమ్స్) నియమ నిబంధనలను స్వయంగా చదివి అర్థం చేసుకోగలగడం, ఇతరులకు వివరించడం, ఎంతో క్లిష్టమైన విషయాలను, అంకెలను గుర్తుపెట్టుకోవడం, తెలివిగా ఎత్తుగడలు వేయడం చేస్తుంటారు. వీటివల్ల వారి మేధస్సు పదును తేలుతుందని గ్రహించడం మనకు కష్టం కాదు! అటువంటి ఆటలు ఆడనివ్వకపోవడం, వారిని ఆ రకంగా ఆలోచించే అవకాశానికి దూరం చెయ్యడం కదా!

**దీనంతటి సారాశం ఏంటంటే...**

24 గంటల్లో ఓ గంట ఆటలకి కేటాయించడానికి
ఇంతకంటె ప్రయోజనాలక్కర్లేదేమో! గంటలు గంటలు సెల్‌ఫోన్లు,
టీ.వీ.లు, కంప్యూటర్‌లు, పుస్తకాలతో కూర్చునే
పసిపిల్లలకు తెలీదు – రేపు 30 ఏళ్ళకే బి.పి., షుగరు లాంటి
వ్యాధులు రావచ్చనీ, గుండెజబ్బులాంటి ప్రమాదాలు కూడా పొంచి
ఉండగలవనీ తెలిసిన పెద్దలుగా "ఆయురారోగ్య ప్రాప్తిరస్తు"
అని ఆశీర్వదించడంతోపాటు
ఓ గంట సేపు రోజూ ఆడుకోనిద్దాం.
వీలైతే మనమూ ఆడుకుందాం!



# 2. కథలెందుకు?

ఈ ప్రశ్న మన చిన్నప్పుడు మనకెప్పుడైనా ఒచ్చిందా?.... రాలేదు.

ఇపుడు పిల్లలెవరికైనా వస్తుందా?... రాదు.

ఆ రాలేదుకీ... ఈ రాదుకి... సంబంధం లేదు.

మనమంతా కథలలో పెరిగాం.

అరుగుమీద కూర్చోబెట్టి అన్నం పెడుతూ అమ్మమ్మ చెప్పిన రాముడి కథలు, కృష్ణుడి కథలు... పెరట్లో నవారు మంచం మీద తాతయ్య పక్కలో ఒదిగిపోయి, గమ్మత్తైన ముసలివాసనని ఎంతో ఇష్టంగా పీలుస్తూ ఆ గంభీరమైన గొంతులో విన్న స్వాతంత్ర్యపోరాట కథలు....

మన రక్తంలో ఇంకా ప్రవహిస్తూనే ఉన్నాయి. ఎన్నివిన్నా కడుపు నిండక ఇంకా ఇంకా అని వెంపర్లాడడమే గానీ, “కథలెందుకు?” అని ఎన్నడైనా ప్రశ్న ఒచ్చిందా? రాలేదు.

ఈరోజు ఉద్యోగాల పుణ్యమా అని మనకు, టివిల పుణ్యమా అని అమ్మమ్మలకు గానీ, తాతయ్యలకు గానీ కథలు చెప్పే తీరికలేదు.

స్కూళ్ళ పుణ్యమా అని, ట్యూషన్ల పుణ్యమా అని వాళ్ళకి వినే తీరిక లేదు! కాబట్టి ‘కథలెందుకు?’ అనే ప్రశ్న మన పిల్లలకు రాదు.

అన్యాయం... పాపం... అని మనకనిపించకపోతే మనం మనుషులమేనాండీ?....

ఐనా... ఈ ప్రశ్న రానే వచ్చింది కాబట్టి సమాధానం వెతుక్కొందాం. చదవండి



## పిల్లలు కథలెందుకు వినాలి?

ఆకట్టుకునేలా, హావభావాలతో, నాటకీయంగా కథచెప్పగలిగితే పిల్లలు ఒళ్ళుమరచి, కళ్ళు చెవులు అప్పగించి వింటారు. అప్పుడు వారి ఏకాగ్రత తారాస్థాయిలో ఉంటుంది.

ఆసక్తిగా వినే క్రమంలో అర్థంకాని పదాలు దొర్లితే వాటిని అప్రయత్నంగానే సందర్భానుసారంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తారు – కథ వాటి మూలంగా ఆగడం

నచ్చుదు కనుక. అర్థం కాని పదంగానీ, విషయం గానీ కథ అర్థంకావడానికి అడ్డంపడుతోంది అనిపిస్తే వెంటనే ప్రశ్నిస్తారు. ప్రశ్నలు వేయడం – సందేహాలు తీర్చుకోవడం అలవడుతుంది.

టి.వి., కంప్యూటర్ వంటి దృశ్యమాధ్యమాల్లో ఊహించేందుకు తావుండదు. కథ వింటున్న పిల్లలు అందులోని దృశ్యాలనీ, వ్యక్తుల్నీ, జంతువుల్నీ వారి ఊహల్లో చూస్తారు. అదో అద్భుతమైన అనుభవం!

ఊహల్లో – నిజజీవితంలో ఎన్నడూ అనుభవంలోకి రాని వింతైన అనుభవాలకు లోనౌతారు. (సాహసం, పరాక్రమం, గాలిలో ఎగరడం, ఈగంత చిన్నగా అయిపోవడం, కొండంత పెద్దగా పెరిగిపోవడం లాంటివి)



సాధారణంగా పిల్లలు కథలోని ప్రధానపాత్రలతో తమని గుర్తించుకుంటారు. (ఆడపిల్లలైతే రాజకుమార్తెగానో, అబ్బాయైతే రాజకుమారుడిగానో). ఆ పాత్రలయొక్క లక్షణాలు తమవిగా ఊహించుకోవడంలో అప్రయత్నంగా మంచి విలువలను, వీరోచిత లక్షణాలను కలిగి ఉండడం, చెడును ఎదిరించడం, న్యాయాన్ని రక్షించడం లాంటి గుణాలు తమలో ఉండాలని కోరుకుంటారు. (అందుకే చిన్నపిల్లల కథల్లో ప్రధానపాత్రలు ఉదాత్తంగా, ఉన్నతంగా ఉండాలి)



విభిన్న నేపథ్యాలున్న కథలు చెప్తే పిల్లలు వాటి ద్వారా ఎన్నో సంగతులు నేర్చుకుంటారు. పాఠం వినేటప్పటికంటే, కథ వినేటప్పుడు ఏకాగ్రత పదిరెట్లు ఎక్కువ ఉంటుంది కాబట్టి, చరిత్ర సంగతులు, పురాణగాథలు, వివిధ దేశాల జీవనశైలులు లాంటి విషయాలెన్నో

కథల ద్వారా విన్నప్పుడు వాటిని సులభంగా గుర్తుపెట్టుకుంటారు.

హాస్యపూరిత కథలైనా, సాహసగాధలైనా, పురాణాలైనా, పంచతంత్రంవంటి జంతువుల కథలైనా, ప్రస్తుత కాలం నేపథ్యంగా ఉన్న కథలైనా... ఏవైనాగానీ మంచి-చెడులను పిల్లలు అలవోకగా వడపోసి విలువలను వారే నిర్ధారించుకోగలుగుతారు. నీతిని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కథల్లోని పాత్రలు, వాటి లక్షణాలు పిల్లలపై వారి వ్యక్తిత్వనిర్మాణంపై గాఢమైన ప్రభావం చూపిస్తాయి.

కథలు చెప్పడం - పిల్లలు వినడంలో పెద్దలకు పిల్లలకు మధ్య అనుబంధం ఏర్పడుతుంది. మీరు అమ్మానాన్నలైతే మీపట్ల పిల్లలు మరింత ఆపేక్ష పెంచుకుంటారు. మీరు టీచర్లైతే పిల్లలకు దగ్గరవడానికి. వారిలో బెరుకు. సంకోచం పోగొట్టడానికి ఇది మంచి మార్గం.



## పిల్లలు కథలెందుకు చదవాలి?

కథలే కాదు. అసలు పిల్లలు ఏదైనా ఎందుకు చదవాలి? చదవడం బాగా వస్తే మంచి మార్కులొస్తాయి. మంచి మార్కులొస్తే మంచి ఉద్యోగమొస్తుంది.... ఇలాంటివి పెద్దవాళ్ళుగా మనం ఆశించే ప్రయోజనాలు. కానీ పిల్లలెందుకు చదువుతారు?

చదివేది వారికి ఇష్టంగా ఉంటే చదువుతారు.

చదవడం సంతోషంగా ఉంటే చదువుతారు.

మరి కథలకు మించినవేమన్నా అలాంటివి ఉన్నాయా?

చదవడం జ్ఞానసముపార్జనకి అత్యంత అవసరం. చదవడం అనేది పరీక్షలకోసమో, మార్కులకోసమో కాదు. క్రొత్త విషయాలను నిరంతరం తెలుసుకుంటూ ఉండడంలోని ఉత్సాహంకోసం, విచిత్రమైన ఊహల ప్రపంచంలో విహరించడానికి, థ్రిల్‌కోసం, చక్కని భాషను ఆస్వాదించడంలోని ఆనందంకోసం చదవడం వ్యసనం కావాలి.

విస్తృతమైన పఠనాభిలాష, అలవాటు ఉన్న పిల్లలకు పాఠ్యపుస్తకాలలోని విషయాలను చదవడం, మంచినీళ్ళ ప్రాయమే అవుతుంది. (మనకు కావాల్సిన మార్కులూ వస్తాయి!)

ఒక పాఠ్యపుస్తకం ద్వారా కొన్ని విషయాలు మాత్రమే తెలుస్తాయి. ఇతర పుస్తకాలు చదివే పిల్లలకు ఎన్నో విషయాలు తెలుస్తాయి.

రకరకాల పుస్తకాలు చదివే పిల్లలకు భాషపై పట్టు అలవోకగా వచ్చేస్తుంది. తెలిసిన విషయాన్ని చక్కగా వివరించి చెప్పగలిగే, వ్రాయగలిగే నైపుణ్యం సులభంగా అలవడుతుంది. కాబట్టి ప్రశ్నలు–జవాబులు బట్టీ వేయడం అనే వ్యర్థప్రయాస వారికి అవసరం ఉండదు.

చదివే అలవాటున్న పిల్లలు చదవడం, వ్రాయడం, విషయ పరిజ్ఞానం, సృజనాత్మక వ్యక్తీకరణలాంటి విషయాల్లో ఖచ్చితంగా మెరుగ్గా ఉంటారు.

చదివే ప్రతి పుస్తకం పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది – చదవడం ఎన్నో నైపుణ్యాలను, జ్ఞానాన్ని ఇస్తుంది కాబట్టి.



## పిల్లలు పుస్తకాలు ఎందుకు కొనుక్కోవాలి?

35 రూపాయలు పెట్టి పిసరంత కిండర్‌జాయ్ మురిపెంగా కొనిపెడతాం. 100 రూపాయలు టికెట్టు పెట్టి సినిమాకు తీసుకెళ్తాం. వేలరూపాయలు పోసి నెలకోసారి కూడా వేసుకోని దుస్తులు కొనడానికి ముందుంటాం. అదే యాభయ్యో, వందో పెట్టి ఓ పుస్తకం కొనాలంటే మనసు రాదెందుకో కొందరికి.

వారాంతాల్లో సినిమాకో, మాల్‌కో, హోటల్‌కో తప్పనిసరిగా తీసుకెళ్ళడం మధ్యతరగతి కుటుంబాలలో సంప్రదాయమై పోయిందీ మధ్యకాలంలో. వాటికయ్యే వేల రూపాయల ఖర్చుతో పోలిస్తే నెలకి రెండుమూడు వందలు పెట్టి, పుస్తకాలు కొనడం భారం కాదు.

అనారోగ్యం పాలు చేసే వృథాఖర్చులు సంతోషంగా పెడుతున్నాం. అనంతమైన జ్ఞానాన్నిచ్చి బ్రతుకును అర్థవంతం చేసే పుస్తకాల విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నామో ఆలోచించుకోవాలి.

చదివే అన్ని పుస్తకాలూ కొనక్కర్లేదు. కానీ కొన్ని పుస్తకాలైనా పిల్లలు తమ సొంతమనీ భావించాలి. నచ్చిన పుస్తకాలు కొనుక్కోవడం, వాటిని మళ్ళీమళ్ళీ ఎప్పుడు కావాలంటే

అప్పుడు చదువుకొనే అవకాశం ఉండడం – తమ స్నేహితులలో ఇచ్చిపుచ్చుకోవడం లాంటివి పిల్లలకు పుస్తకాల మీద మక్కువని పెంచుతాయి.

పుస్తకాలు కొనుక్కున్నపుడే అవి విలువైనవని పిల్లలకు అర్థమవుతుంది. లేదంటే బట్టలు, బొమ్మలు, చెప్పులు, నగలు లాంటివే కొనదగిన వస్తువులని అనుకుంటారు. పుస్తకాలను పిల్లలకు బహుమతులుగా ఇవ్వడం, తమ స్నేహితులకు బహుమతులుగా ఇప్పించడం వంటివి అలవాటు చేస్తే వాటిమీద ప్రీతి పెరుగుతుంది.

వారాంతాల్లో లైబ్రరీకి వెళ్ళడం అలవాటు చెయ్యాలి. అదో అద్భుత ప్రపంచమనీ, మనలాగా చాలామంది ఇష్టంగా అక్కడికి వస్తారనీ, చదువుకోవడం అనేది అన్ని వయస్సుల



వారూ చేసే పని అనీ అర్థంచేసుకోవడంతోపాటు నిశ్శబ్దంలో ఒక్కరే చదువుకోవడంలోని విలువని అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు. అది అలవాటుగానూ మారుతుంది.

ఒక విషయం చెప్పేదానికంటే, పిల్లలు పెరిగే వాతావరణంలో అది ఒక భాగమైనప్పుడు దానిని వారు త్వరగా గ్రహిస్తారు. కథలు చదవమని పిల్లలను ప్రోత్సహించడంతో పాటు, రోజూ కొంత సమయమైనా ఇంటిలో కుటుంబసభ్యులు (బడిలోనైతే టీచర్లతో కలిసి లైబ్రరీ పీరియడ్‌లోనూ) చదువుకొనే వాతావరణం, చదివిన కథల గురించి మాట్లాడుకోవడం లాంటి అలవాట్లు కనుక ఉంటే చదివే గుణం సహజంగా అబ్బుతుంది.

పిల్లలకు మనమివ్వగలిగిన అతి విలువైన కానుక వారితో సమయం గడపడమంటారు. కథలు మనకా గొప్ప అవకాశాన్నిస్తున్నాయి. మనకెంతో ఇష్టమైన పిల్లలపై మన ప్రేమను వ్యక్తం చెయ్యడానికి, వారితో కలిసి విహరించి ఆనందం పంచుకోవడానికీ కథల ప్రపంచం పిలుస్తోంది... అందరినీ!!!

# డ్రామాలెందుకు?

డ్రామా.... నాటకం... నటన... అంటే నిజం కానిది.

మనం కానిది... మరి మనకెందుకు?

నటన మనిషికి సహజసిద్ధంగా ఉండేదే. 'వచ్చేది' కాదు.

ఊహ తెలిసినప్పటినుంచీ పిల్లలు నటిస్తూనే ఉంటారు.

ఏడాది కూడా లేని పిల్లలు పిల్లిలా... మ్యావ్ అంటూ పాకుతారు.

కుక్కలా భౌ...భౌ... అంటూ మనమీదకొచ్చి భయపెడతారు.

మన ఎదురుగానే ఉన్న చిన్నారిని మనం చూడనట్టు నటిస్తూ "ఏదీ నా బంగారు తల్లీ? ఎక్కడుంది??" అంటూ వెతుక్కుంటుంటే సంభ్రమంతో సంబరపడిపోతుంది.

అది మొదలు జీవితంలోని అన్ని దశలలో ప్రతినిత్యం  కాకపోయినా



ఎంతోకొంత నటనాచాతుర్యం ఆపద్ధర్మంగా అందరం ప్రదర్శిస్తూనే ఉంటాం.

మరి ప్రత్యేకించి డ్రామాలు ఎందుకు?


ప్రదర్శించే కళారీతుల్లో డ్రామా ప్రముఖమైంది అని అందరికీ తెలుసు.

డ్రామా ద్వారా పిల్లలలో పెంపొందే ఎన్నో నైపుణ్యాలను, వికాసాలనూ దృష్టిలో పెట్టుకుని Central & State Educational Boards అన్నీ కూడా ఈ ప్రక్రియను పాఠ్యాంశాలలో చొప్పించాయి. సంవత్సరంలో ఓసారి వేదికమీద ప్రదర్శనకో, పోటీలకో కాక విద్యా ప్రణాళికలో భాగంగా డ్రామా ఉండాలని, అందరి పిల్లలకూ అవకాశాలు రావాలనీ నిర్దేశించాయి. ఎందుకు పిల్లల వికాసంలో

డ్రామా అంత ప్రముఖంగా చెప్పబడుతోందంటే... చాలా కారణాలున్నాయి.

## డ్రామాలెందుకు?

### మానసిక వికాసానికి....



డ్రామాలో తాము పోషించే పాత్రయొక్క భావోద్వేగాలను (తాత్కాలికంగానైనా కానీ) పిల్లలు అనుభవిస్తారు. తద్వారా ఒకో పరిస్థితిలో వేరే వాళ్ళ స్పందనలు, ఎలా ఉంటాయో అర్థం చేసుకోగలిగే అవకాశం ఉంటుంది.

ప్రపంచాన్ని తన దృష్టితోనే కాక, జంతువుల, ఇతర మనుష్యుల దృష్టికోణం నుండి చూడడం అలవడుతుంది. దీనివల్ల జీవులపట్ల, మనుష్యుల పట్ల సహానుభూతి కలిగి ఉంటారు.

పంచతంత్రం, తెనాలి రామకృష్ణుడి కథల వంటివి డ్రామాల రూపంలో వేస్తున్నపుడు అందులోని పాత్రల తెలివితేటలు, సమయస్ఫూర్తి వంటివి వారిలో కూడా పెంపొందేలా చేస్తాయి.

విలువలతో కూడిన కథలను ప్రదర్శించే క్రమంలో అంతర్లీనంగా అవి వారిపై ప్రభావం చూపిస్తాయి. కష్టపడి సాధన చేశాక విజయవంతమైన డ్రామా ప్రదర్శన పిల్లలలో ఎనలేని ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. ఇది వారి వ్యక్తిత్వ నిర్మాణంలో కీలకమైనది.

## డ్రామాలెందుకు?

### భాషాభివృద్ధికి...

భాషాభివృద్ధికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది. పుస్తకాల ద్వారా, వినడం ద్వారా వచ్చిన భాషా పరిజ్ఞానం ఇందుకు ఉపకరిస్తుంది.

నిత్యజీవితంలో మన చుట్టూ ఉన్న వారితో సత్సంబంధాలు నెరపడంలోను, కావలసిన పనులు జరిగేలా చూసుకోడంలోనూ మన సంభాషణాచాతుర్యం పెద్ద పాత్ర వహిస్తుంది.

డ్రామాల్లోని వివిధ సందర్భాలలో రకరకాల పాత్రల పోషణలలో పిల్లలు

సంభాషించడంలో నైపుణ్యాలు పెంచుకుంటారు.

డ్రామాద్వారా పరిచయమైన పదజాలాన్ని, వాక్యనిర్మాణాలను పిల్లలు చాలా బాగా సొంతంచేసుకోవడం, మరల మరల వాటిని నిత్యజీవితంలో ప్రదర్శించడం చూస్తుంటాం.

ప్రాథమిక స్థాయి పిల్లలకు వీలైనంత వరకు సంభాషణలు అప్పటికప్పుడు వారే కల్పించుకునే అవకాశమిచ్చినట్లైతే వాళ్ళ భాష విశేషంగా మెరుగవుతుంది. పెద్ద పిల్లలకు కూడా ఈ అవకాశం తప్పక ఉండాలి.

రోల్‌ప్లే, మోనోయాక్షన్‌వంటి తక్కువ సమయం పట్టే, అందరికీ అవకాశాలుండే ప్రక్రియల వల్ల కొందరి పిల్లలలో మాట తడబాటు, నత్తి, వంటివి తగ్గి స్పష్టంగా సంభాషించగలిగే అవకాశం ఉంది.



ఈ రకమైన కృత్యాలు పదిమంది ముందు మాట్లాడలేని పిల్లల బిడియం, బెదురు, సంకోచం పోగొట్టి ధైర్యంగా మాట్లాడే ప్రోత్సాహాన్నిస్తాయి.

మంచి ఉచ్చారణ నేర్చుకోవడానికి పిల్లలకు ఇష్టమైన మార్గం రోల్‌ప్లేలు, డ్రామాలు.

డ్రామా వెయ్యడం వల్ల ఆ భాషతో దగ్గరితనం ఏర్పడుతుంది.

తెలుగు, హిందీ, ఇంగ్లీషులలాంటి భాషలలోని ఐతిహాసిక కథలను డ్రామాల రూపంలో వేయడం వాటి భాష, అందులోని పాత్రలు వారి మనసులలో గాఢంగా హత్తుకుపోతాయ్. మరింత చదివేందుకు స్ఫూర్తినిస్తాయి.

పుస్తకాలకు పిల్లలను దగ్గరచెయ్యడానికి ఇదో మంచి ఉపాయం.

హావభావాలతో, అభినయంతో, స్పష్టంగా మాట్లాడడం తెలుస్తుంది. ఎలా చెప్తే ఇతరులకు చక్కగా అర్థమవుతుందో, ఏ పరిస్థితిలో ఎలా మాట్లాడాలో అర్థమవుతుంది. ఇది ఇతరులతో సంబంధాలను మెరుగుపరుస్తుంది.

## డ్రామాలెందుకు?

### బృందంలో చక్కగా ఇమడగలగడానికి....

మోనోయాక్షన్, పప్పెట్రీ, రోల్‌ప్లే వంటివి ఒక్కరే చేసినా, డ్రామా అంటే బృందం చేసే పనే. కథను ఎంచుకోవడం, సంభాషణలు తయారు చేసుకోవడం దగ్గర్నుంచీ ప్రదర్శించే వరకు అన్ని పనులలోను అందరికీ అందరి సహకారం కావాలి. సహకారం ఇచ్చిపుచ్చుకునే విధానాలు అలవడతాయి.

డ్రామా విజయవంతమైతే అది ఒక్కరి విజయం కాదు. బృందంగా అందరూ సంతోషం పంచుకుంటారు.



## డ్రామాలెందుకు?

### సృజనాత్మక వ్యక్తీకరణకు....

డ్రామా ప్రయోజనం వేదికమీద ప్రదర్శించడానికో, పోటీకో కానప్పుడు అంతిమంగా ప్రదర్శనకంటే కూడా, ప్రక్రియ అంతా ముఖ్యమే అవుతుంది.

కథ ఎన్నుకోవడం దగ్గర్నుంచీ, సంభాషణలు వ్రాసుకోవడం, దుస్తులను, స్టేజిని రూపొందించుకోవడం, ప్రదర్శనా ప్రణాళిక వరకు అన్ని అంశాలలో పిల్లల సృజనాత్మకతను వ్యక్తీకరించే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి.






డ్రామా ఎన్నో అంశాల కలబోత. వ్రాయడంలో కొందరిది పాత్ర అయితే, దర్శకత్వం కొందరు, దుస్తుల ఎంపికలో మరికొందరు, స్టేజి నిర్వహణ మరికొందరు – ఇలా ఒక్కో అంశాన్ని చిన్న బృందాలుగా వారు నిర్వహించుకోవడంలో అందరికీ తమ నైపుణ్యాలను, సృజనాత్మకతను పెంపొందించుకునే, వ్యక్తీకరించుకునే అవకాశం ఉంటుంది.

డ్రామాల వల్ల పెంపొందే వివిధ నైపుణ్యాలు – భాషాపరంగా గానీ, నిర్వహణాపరంగా గానీ, సృజనాత్మకత విషయంలో గానీ – పిల్లలు చదువులో మెరుగుపడడానికి తోడ్పడతాయనడం పరిశీలనలో తేలిన విషయం.

డ్రామా పిల్లలలో తీసుకువచ్చే మార్పులు మరే ఇతర ప్రక్రియ తేలేదనేది అతిశయోక్తి కాదు. ఎందుకంటే చిత్రలేఖనం, పాట, డాన్స్‌వంటివి అందరూ చెయ్యలేరు. సాధనలో అందరు పిల్లలూ ఎంతోకొంతగానీ, అద్భుతంగాగానీ చెయ్యగలగడం డ్రామా ఓ ప్రధానభాగంగా నడిచే ఏ బడిలోనైనా అనుభవంలోకి వచ్చే విషయమే.

అందుకే, నాటకం, తదితర ప్రక్రియలైన పప్పెట్రీ, మోనోయాక్షన్, రోల్‌ప్లే వంటి వాటికి పెద్దపీట వేయాలనీ, పాఠ్యప్రణాళికలో భాగం చెయ్యాలనీ, అందరికీ పిల్లల తరపున విన్నపం.

# క్రాఫ్ట్ ఎందుకు?

ఇవి చూడడానికి ముచ్చటగ ఉంటాయి గానీ... అమ్మల గుండెల్లో గాభరా పుట్టిస్తాయి.
పువ్వో, పూలసజ్జో... ఓ అందమైన ఆకారం తయారయ్యిందంటే దాని వెనుకే కాగితం
ముక్కల కుప్పలు, గుడ్డపీలికలు, రంగుల మరకలు... చెత్త తయ్యారు.
కత్తులు, బ్లేడ్లు, కత్తెరలు... అమ్మో! చెయ్యి తెగుతుందేమో!
అంతంతసేపు వాటితో గడిపితే ఇక చదువెప్పుడు?
ఇవన్నీ అమ్మల సమస్యలు.
"నీ చేతిపని కాదుగానీ... నా చేతినిండా పని!
నువ్వు చెయ్యావద్దు – ఇంటినిండా చెత్త పొయ్యావద్దు" అంటారంటే అనరూ....?
కానీ అమ్మకీ మనసులో సంబరమే.
'ఎంత బాగా చేసింది నాతల్లి!' అని సంబరపడిపోతుంది.
ఎంత చెత్త పోసినా, 'కాదేదీ క్రాఫ్టుకనర్హం' అన్నట్టు చిన్నారుల చిట్టిబుర్రలు,
చిన్ని చేతులు చెత్తనుండి కళాఖండాలు సృష్టిస్తాయి మరి.
ఆదినుంచి మనిషి పరిణామక్రమంలో, నాగరికత పెంపొందే దిశలో శాస్త్రవిజ్ఞానం
శాఖోపశాఖలుగా విస్తరించడంలో – చేతిపనులు, దాని వెనుక సృజనాత్మకమైన ఆలోచన
ముఖ్యపాత్ర వహించాయని చెప్పొచ్చు. తన సొంత ఆలోచననుండి, మేధస్సునుండి
ఊహలోంచి ఒక వస్తువును లేదా ఆకృతిని సృష్టించడాన్ని
క్రాఫ్టువర్కు / హస్తకళ / చేతిపని అంటున్నాము.
రాళ్ళను ఆయుధాలుగా చెక్కడం నుంచి రాకెట్టు తయారీ వరకు...
జుట్టును రకరకాల కొప్పులుగా మలచడం నుంచి శరీరంలో భాగాలలోకి సైతం
చొచ్చుకుపోగల ఆంజియోస్కోపు పరికరం తయారీ వరకు...
తాటాకు బొమ్మనుంచి రోబోల వరకు...
అన్నీ మనిషి సృజనకు చేతిపని జోడై పుట్టినవే.
సృజనాత్మకత ఊహల్లో రూపాన్ని పుట్టిస్తే... నైపుణ్యం దానికి నిజరూపాన్నిస్తుంది.
నృత్యం, సంగీతం, నటన వంటి కళారూపాలకు క్రాఫ్ట్‌వర్క్ భిన్నమైంది.
తన ఊహల్లో రూపుదిద్దుకున్న వస్తువు స్పృశించగల నిజరూపం దాల్చడం
పిల్లలకు అద్భుతంగా అనిపిస్తుంది. ఒక పరిపూర్ణమైన వస్తువును
తాను సృష్టించానన్న వెలకట్టలేని ఆనందాన్నిస్తుంది.

## ఎందుకు క్రాఫ్ట్‌వర్క్ ఎక్కువమంది పిల్లలను ఆకట్టుకుంటుంది?

పాఠాలు, పరీక్షలు, మార్కులు – ఈ మూడు విషయాల చుట్టూనే తిరిగే చక్రంలో చాలామంది పిల్లలు ఇమడలేరు. సహజసిద్ధమైన తెలివితేటలు ఉన్న పిల్లలు కూడా యాంత్రికంగా హడావుడిగా సాగిపోయే పాఠ్యకార్యక్రమాలలో ఎక్కువ ఆసక్తి చూపరు. క్రాఫ్ట్‌వర్క్‌లో మాత్రం అన్నిరకాల పిల్లలు, అన్ని స్థాయిల పిల్లలు ఇష్టంగా పాల్గొనడం చూస్తాం.



**ఎందుకంటే.....**

ఆలోచనలలో, నైపుణ్యంలో, వేగంలో పిల్లల మధ్య ఉండే వ్యత్యాసాలకు తగినంత స్థానముండడం.

సొంతపద్ధతిని కనిపెట్టే అవకాశం, తన ఆలోచనా పరిధిని ఎంతైనా విస్తరించుకునే అవకాశం ఉండడం

పరీక్ష, పోటీ లేకపోవడం

తనలో నిగూఢమై ఉన్న శక్తులను సంపూర్ణంగా ఆవిష్కరించుకునే అవకాశం ఉండడం

అంచెలంచెలుగా నిర్మించుకుంటూ జరిగే ప్రక్రియ కాబట్టి ఎప్పటికప్పుడు తన పనిని గమనించుకుంటూ మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశముండడం

మొదలు పెట్టిన పనిని మధ్యలో ఆపి, ఇష్టమైనప్పుడు తిరిగి కొనసాగించే వీలుండడం.

## ఏమిటి లాభం?

కత్తిరించడం, అంటించడం, ముడులు వెయ్యడం, మడవడం వంటి పనులు చేయడం వల్ల సూక్ష్మకండరాల అభివృద్ధితోపాటు కంటి–చేతి సమన్వయం పెరుగుతుంది.

తన మనసులోని ఆలోచన చివరికి ఏ ఆకారాన్ని దాల్చబోతోందో ఇంచుమించుగా ఊహల్లో ఉంటుంది కాబట్టి దానిని తయారుచేయడానికి ఏ రకమైన వస్తువులు, పదార్థాలు, పరికరాలు కావాలో, ఏ ఆకారంలో, ఎంత పరిమాణంలో దాని భాగాలు చెయ్యాలో, దేని తర్వాత ఏది చెయ్యాలో అనే విస్తృతమైన ప్రణాళిక వేసుకోవడం తప్పనిసరిగా చేస్తారు.



బృందంలో భాగంగా క్రాఫ్టువర్కు చేసినప్పుడు పరస్పరం ఆలోచనలను పంచుకోవడం, సహకరించుకోవడం, ఒకరి పనిని ఇంకొకరు గుర్తించి మెచ్చుకోవడం లాంటి సాంఘిక నైపుణ్యాలు అలవడతాయి. ప్రక్కవారినుండి పిల్లలు అత్యంత తొందరగా నేర్చుకుంటారు.

ఎవరికివారు తీవ్రమైన ఏకాగ్రతతో ఒక్కరే పనిచేసేటప్పుడు తమ శక్తులపైన, నైపుణ్యాలపైన ఖచ్చితమైన అవగాహన, అంచనా కలుగుతాయి.

సాధారణంగా పోల్చిచూసే, పోటీపెట్టే వాతావరణం లేని చోట పిల్లలు వాళ్ళ పనిని మనస్ఫూర్తిగా చేసి చివరకు తాము తయారుచేసిన వస్తువును చూసుకొని సంతృప్తి చెందుతారు. ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెంపొందడంలో ఇది కీలకమైన విషయం.

రకరకాల వస్తువులను తయారుచేసే క్రమంలో పరిమాణాలు, జామెతీ ఆకారాలు, రంగుల కలయిక, బ్యాలెన్సు (గరిమనాభి ఆధారంగా) వంటి భావనలపై తెలియకుండానే పట్టు సాధిస్తారు.

ఆసక్తి పుట్టించని, అర్థవంతంగా అనిపించని, సంతోషాన్నివ్వని పాఠ్యాంశాల మూలంగాను, విద్య నేర్పబడుతున్న తీరువల్లను, స్వతహాగా నేర్చుకునే నేర్పు, తెలివితేటలు ఉన్నా గానీ కొందరు పిల్లలు చదువులో వెనుబడుతుంటారు. తెలివి తక్కువ వారిగా, చేతకాని వారిగా ముద్ర వేయబడుతుండడం కూడా జరుగుతుంది. దాని కారణంగా వాళ్ళు తమకు నిజంగానే ఏమీ చేతకాదనే భావనలోకి వెళ్ళిపోయి మరింత వెనుకబడే అవకాశం ఉంది.

క్రాఫ్టువర్కు పిల్లలకు తమలోని మేధోశక్తిని, నైపుణ్యాలను ఆవిష్కరించుకునే అవకాశం ఇస్తుంది. అది ఇచ్చే ప్రోత్సాహం, సంతృప్తి వల్ల పిల్లలు తమని తాము నమ్మడం ప్రారంభిస్తారు. పాఠ్యాంశాలు నేర్చుకోవడంలో కూడా నైపుణ్యాలు సాధించేందుకు ఖచ్చితంగా దోహద పడుతుంది.

అంచనా, తర్కం, జామెతి, లెక్కలు గట్టడం వంటివి క్రాఫ్టువర్కులో అంతర్లీనంగా ఉండడం వల్ల పిల్లలకు ఆ నైపుణ్యాలు తెలియకుండానే పెరుగుతాయి. అందువల్ల గణితం, సైన్సు వంటి అంశాలలో వెనుకబడిన కొందరు పిల్లలలో క్రాఫ్టువర్కు ద్వారా అద్భుతమైన మార్పులు రావడం గమనించవచ్చు.



తాను తయారుచేసిన వస్తువు ఆమోదయోగ్యం గానూ, కంటికి ఇంపుగానూ ఉండాలన్నది ప్రధాన విషయంగా ఉంటుంది. తమకి నచ్చేంత అందంగా తయారుచేద్దామని ప్రయత్నిస్తారు. ఇతరుల పనిని కూడా అదే దృష్టితో చూసి ఆనందిస్తారు.

ఇన్ని సంగతులు తెలుసుకున్నాక మనకి అర్థం కావాల్సిందేమిటంటే....

చేతి పని కేవలం అందమైన ఆకృతుల్ని తయారుచేసే ప్రక్రియకాదు.

ఇది వృధా కాలక్షేపం కాదు. దీనికి ఎక్కువ డబ్బులు ఖర్చుపెట్టాలన్న నిబంధన లేదు.

చురుకైన పిల్లలకు, నెమ్మదస్తులకు, చదువులో ముందున్నా, వెనకున్నా... అందరికీ చేతిపనుల వల్ల ఎంతో లాభం.

పిల్లల సమగ్ర వికాసంలో దానికెంతో విశిష్టమైన పాత్ర ఉంది.

బడులలో దీనికిక పెద్దపీట వేయాలనీ, ప్రత్యేక సమయం కేటాయించాలనే నిబంధన ఉంది. నిబంధనలకు నీళ్ళు వదిలేయడం ఎలానూ ఉంది కాబట్టి... అమ్మానాన్నలుగా ఆ అవకాశాన్ని మీరైనా ఇవ్వగలరేమో తప్పక ప్రయత్నించండి.

# పాటలెందుకు?

మాట – పాట

పని – పాట

ఆట – పాట

ఏం చేసినా ప్రక్కన ఈ పాటేమిటి? ప్రాస కోసమా?

కాదు, కాదు...

మాటకి అందం పాట

పనికి తోడు పాట

ఆటకి జోడీ పాట... అన్నిటికీ దన్ను పాట!

ఎక్కడుందీ పాట? ఎక్కడ లేదీ పాట?

పాపాయి ఏడుపులో పాట – కిలకిల నవ్వులో పాట

గాలి ఈల పాట – అలల సవ్వడి పాట

చిటపట చినుకుల పాట – ఆకుల గలగల పాట

ఈ కవిత్వం మాకు తెలియందా?

అసలింతకీ 'పాటెందుకు' అని కదా ప్రశ్న! దాని దగ్గరకే వద్దాం.



**పాటలెందుకు?**

**పిల్లలకి ఇష్టం కాబట్టి...**

జోలపాట పాడందే పాపాయి నిద్రపోదు.

చిట్టిపొట్టి పాటలకు చిన్నారి చిందులేస్తుంది.

పాట పాడితే బుజ్జిగాడు ఏడుపాపేస్తాడు.

పాటలంటే పిల్లలకిష్టమని వేరే చెప్పాలా?

పాటలోని రాగం, లయ పిల్లల్లో అత్యంత సహజంగా ప్రవహిస్తుంటాయి. పాట వినడం, పాట పాడడం రెండూ పిల్లలకు అత్యంత ఇష్టమైన పనులు.



## పాటలెందుకు?

### పాట ఒత్తిడిని తగ్గిస్తుంది....

పిల్లలు రకరకాల ఆందోళనలకు, ఒత్తిడికి లోనవుతూ ఉంటారు. వాటిని దూరం చెయ్యడానికి ఆటలు ఒక మార్గమైతే, పాటలు పాడడం, వినడం గొప్ప స్వాంతన కలిగిస్తుంది.

హడావుడిగా, గందరగోళంగా, చికాకుగా ఉండే పిల్లలలో పాట గొప్ప మార్పు తీసుకొస్తుంది.

### నేర్చుకునేందుకు శక్తిమంతమైన మాధ్యమం

పాటల ద్వారా ఎన్నో సంగతులు పిల్లలకు చెప్పడం ఇప్పుడు క్రొత్త విషయం కాదు.

పూర్వం నేర్చుకోవడం అనే ప్రక్రియ ప్రధానంగా పాటద్వారానే జరిగేదని, రోజువారీ పనుల దగ్గర్నుండీ జీవితసత్యాల వరకు పాటల్లోనే చెప్పడం జరిగేదనీ మనకు తెలుసు.

ఇష్టమైనది ఎంత కష్టమైనా చేస్తారు పిల్లలు. కష్టమైన పనిని ఇష్టమైన విధంగా చెబితే నేర్చుకోవడం సులభతరమౌతుంది.

అక్షరాలు – అంకెలు; రంగులు – ఆకారాలు

జంతువులు – పక్షులు;

అలవాట్లు – బుద్ధులు

నీతులు – నిజాలు

ఎన్నో – మరెన్నో విషయాలు పాటల ద్వారా చెప్తే అలవోకగా గ్రహించేస్తారు పిల్లలు.

పాట ద్వారా నేర్చుకున్న విషయం గాఢంగా వారి మనసులో ఉండిపోతుంది. మర్చిపోవడం అనే ప్రశ్న ఉండదు. పాటలను మళ్ళీ మళ్ళీ ఇష్టమైనప్పుడల్లా పాడుకుంటారు కాబట్టి ఎవరు చెప్పకుండానే పునశ్చరణ జరిగిపోతుంది.

పాటల్లో వచ్చే అనేక సందేహాలను ఆసక్తిగా అడిగి తెలుసుకోవడం చేస్తుంటారు. అందువల్ల ఎన్నో విషయాలు తెలుస్తాయి.

## భాషాభివృద్ధికి....

వచనంలోకంటె పాటలో పదాల వాడుక, అమరిక అందంగా ఉంటుంది. పిల్లలను ఆకట్టుకుంటుంది. భాషపట్ల ఇష్టం పుట్టడానికి ఇది అత్యంత అవసరం.

పాటల్లో వాడబడిన పదకట్లు, పదాల అల్లిక, పోలిక, ప్రాస వంటి అంశాలు పిల్లలను తమ సొంతంగా ప్రయోగించడానికి ఉత్సాహపరుస్తాయి.



ఎన్నో తెలియని పదాలు పాటల ద్వారా తెలుసుకుంటారు - ఎప్పటికీ వాటిని గుర్తుపెట్టుకుంటారు.

పాటలు పరోక్షంగా చదవడాన్ని ప్రేరేపిస్తాయి. చదవడమంటే ఆసక్తి లేని పిల్లలకు బాణీలు కట్టమని చిన్న చిన్న మాటలను వ్రాతలో ఇవ్వడం ద్వారా వారిని చదివేందుకు సిద్ధం చెయ్యవచ్చు.

పిల్లలు అత్యంత సహజంగా పదాలను జిగిబిగిగా అల్లి పాటలను తయారుచేసి తమ సొంత బాణీలో పాడెయ్యగలరు. ఈ సహజ సిద్ధమైన ఆసక్తినీ, నైపుణ్యాన్నీ వ్రాయడం ప్రోత్సహించడానికి ఉపయోగించుకోవచ్చు.


పువ్వుమీద, వానమీద, బంతిమీద, అమ్మమీద - ఇష్టమైన ఏ విషయం గురించైనా,

వాళ్ళు స్పందించే అంశాలు గ్రహించిన పెద్దలు పాటలను వ్రాయమని ప్రోత్సహిస్తే ఎంతో ఇష్టంగా వ్రాస్తారు పిల్లలు.

మాట్లాడేటప్పుడు సరిగా పలకలేని పదాలను పాటలలో స్పష్టంగా పలకడానికి ప్రయత్నిస్తారు. సాధారణంగా మాటల్లో వాడని పదాలను చక్కగా పలకడానికి ప్రయత్నిస్తారు. దీనివల్ల ఉచ్ఛారణ మెరుగవుతుంది.

**సాంఘికాభివృద్ధికి...**

పాట ఒక్కళ్ళే పాడుకోవడం ఓ సంతోషం - అందరితో పాడడం ఓ సంతోషం. దెబ్బలాటలు, తారతమ్యాలు మర్చిపోయి, అందరూ సంతోషంగా సమయం గడపడానికి ఇదొక మంచి మార్గం.



ఆత్మవిశ్వాసం కోసం....

చదువుల్లో హెచ్చుతగ్గులు ఆర్థిక, సామాజిక తారతమ్యాల వల్ల చిన్నబుచ్చుకునే పిల్లలు గొంతెత్తి కమ్మగా పాడుతూ ప్రత్యేకంగా నిలవడం అసాధారణమైన విషయం కాదు.

సహజసిద్ధమైన ఈ నైపుణ్యం పిల్లలకు ప్రత్యేక గుర్తింపునిచ్చి వారిలో కొండంత ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. తాము బాగా చేయగలిగిన పనులెన్నిటిలో పిల్లలు పాల్గొంటే అది వారిమీద వారికి అంత ఎక్కువ నమ్మకాన్నిస్తుంది. తన మీద అపనమ్మకమే ఓటమి. తనపై విశ్వాసమే గెలుపు.

బృందగానం పిల్లలలో బెరుకు, బిడియం తగ్గిస్తుంది. పదిమందితో పాడడంలో ధైర్యం పెంపొందుతుంది. మెల్లగా ఒక్కరే పాడడానికి కూడా ముందుకొస్తారు.

శారీరకంగా చురుకుగా ఉండని పిల్లలు ఆటలకు దూరమౌతారు. వారికి పాటలు గొప్ప స్వాంతన కలుగజేస్తాయి. ఉల్లాసాన్నిస్తాయి.

## సృజనాత్మక వ్యక్తీకరణ...

'నా పాట – నా ఇష్టం'

అనే అవకాశం పిల్లలకిస్తే పిల్లలు తమ సొంత బాణీలతో ప్రయోగాలు చేస్తారు.

పాటను తిరగేసి – మరగేసి

రాగాన్ని సాగదీసి – కత్తిరించి

పిల్లలు గమ్మత్తులు చేస్తారు.

వాటిని వారి సృజనాత్మక వ్యక్తీకరణగా, సరదా ప్రయోగాలుగా చూడాలి.

కొంతమంది పిల్లలకు చెప్పింది చెప్పినట్టు పాడడం అసలు నచ్చదు. చెప్పింది చెప్పినట్టు పాడకపోతే పెద్దలకు నచ్చదు. ఉభయతారకంగా కొన్ని పాటలనైనా వారి స్వేచ్ఛకొదిలి వెయ్యడం అవసరం. పెద్దల ముందు కుదరని స్వేచ్ఛని వాళ్ళు ఎలానో పరోక్షంలో తీసుకుంటారనుకోండి.

ఆ స్వేచ్ఛలేని పిల్లలు పాటలను పూర్తిగా ఆస్వాదించరు. అయిష్టం పెంచుకుంటారు. గొప్ప వాళ్ళు చేసే ప్రయోగాలని మెచ్చుకొని వీరతాళ్ళు వేస్తాం గానీ, పిల్లల ప్రయోగాలను ఆకతాయితనంగా పరిగణిస్తాం. ఆలోచిస్తే అది నిజం కాదని తెలుస్తుంది. పిల్లల సృజనాత్మకత అర్థమవుతుంది.

పాటలెందుకంటే....

కేవలం వేదిక మీద పాడి మెప్పు పొందడానికి కాదు.

శాస్త్రీయ సంగీతంలో దిట్టలవడానికి మాత్రమే కాదు.

పోటీల్లో పాల్గొని బహుమతులు తేవడానికి కాదు.

టి.వి.లో పాడి మనకి గుర్తింపు తేవడానికి కాదు.

పాటపేరిట బాల్యానందాల్ని కోల్పోవడానికి కాదు.

పాటలు ఎందుకంటే...

పిల్లలు హాయిగా సంతోషంగా పాడుకోవడానికి,

గొంతు ద్వారా మనసు విచ్చుకొని విరబూయడానికి,

ఒళ్ళు మరిచి కమ్మగా వాళ్ళు పాడుతుంటే మనం మురిసిపోవడానికి,

పిల్లలతో కలిసి పాడుకుని మనమూ పిల్లలమైపోవడానికి,

ఇంట్లో – వారికి నచ్చిన పాటలను నచ్చిన విధంగా పాడుకునే స్వేచ్ఛనిద్దాం.

అందరు పిల్లలకీ బడిలో కూడా పాటలు నేర్పమని కోరదాం.

# చివరిగా ముఖ్యమైన మాట

"దీప మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు" గత మూడు సంవత్సరాలుగా విద్యావిషయాలపై ఉపాధ్యాయులు మరియు తల్లితండ్రుల అవగాహనకు ఉపయోగపడే వర్కుషాపులు, సెమినార్లు మరియు ప్రదర్శనలు నిర్వహిస్తోంది.

ఈ సంవత్సరం (2014) రెండు వారాలకొకసారి పిల్లలకు క్రాఫ్టు వర్కుషాపులను నిర్వహించడం ప్రారంభించింది. పిల్లల వికాసానికి ఈ కార్యక్రమాలన్నీ, తప్పక ఉపకరిస్తాయన్న నమ్మకంతో లాభాపేక్ష లేకుండా ఈ కృషిని నెరపుతోంది.

చదువుల పరుగుతో పిల్లలు పాఠ్యేతర కార్యక్రమాలైన ఆటలు, పాటలు, కథలు, డ్రామా, క్రాఫ్టువంటి వాటికి దూరమైపోతున్నారు. నిజానికి వారి వికాసానికి, పరిపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణానికి అవి కీలకమైనవి. అందువలనే అవి లేని చదువులు అసంపూర్ణమైనవి. ప్రపంచవ్యాప్తంగా విద్యావేత్తలు తమ అనుభవాలనుంచీ, పరిశీలనలనుంచీ నిర్ధారించి చెప్తున్న విషయాన్ని తల్లితండ్రులకు సులభంగా అవగాహన అయ్యే రీతిలో చెప్పడానికి చేసిన ప్రయత్నమే ఈ పుస్తకం.

26వ విజయవాడ పుస్తక మహోత్సవంలో దీనిని అందుబాటులోకి తీసుకురావడంతోపాటు మరింత ప్రభావవంతంగా విషయాన్ని అందించే ఛార్టుల ప్రదర్శనను కూడా ఏర్పాటుచేయడం జరిగింది.

ఈ ప్రయత్నం కొంతమంది తల్లితండ్రులలోనైనా అవగాహన పెంచుతుందని, తద్వారా పిల్లలకు మంచి జరుగుతుందని మా నమ్మకం. ఈ ప్రయత్నంలో మాతో చేతులు కలిపేందుకు, ఏ కార్యక్రమంలోనైనా, ఏ విధంగానైనా పాల్గొనేందుకు అభిలషించే పిల్లలకు / తల్లితండ్రులకు మా ఆహ్వానం....

టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో, అవగాహనా సదస్సులలో లేదా
పిల్లల వర్కుషాపులో పాల్గొనాలంటే.... ITP<space>పేరు
తల్లితండ్రుల అవగాహనా సదస్సులో పాల్గొనాలంటే.... POP<space>పేరు
క్రాఫ్టువర్కుషాపులో పాల్గొనాలంటే... CTP<space>పేరు
అని 9440579922 నెంబరుకు SMS చేయండి. లేదా ఫోన్‌లో సంప్రదించండి.
మీ వివరాలు kaagitam@gmail.com కు మెయిల్ చేయండి.
www.facebook.com/abhyasavidyalayam